క్లుప్తంగా

గోపన్నపాలెంలో పారిశుద్ధ్య వారోత్సవాలు



గోపన్నపాలెంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తున్న మండల ఈఓఆర్‌డీ మూర్తి

దెందులూరు: ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు నూరు శాతం పూర్తి చేయాలని దెందులూరు మండల పంచాయతీ విస్తరణాధికారి మూర్తి అన్నారు. మంగళవారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ఆయన ప్రారంభించారు. పనులను మండల పంచాయతీ విస్తరణాధికారి పరిశీలించి పలు సూచనలు చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



నాగేశ్వరరావు, లక్ష్మికి నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో నివసిస్తున్న యువ్వనపూడి నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులకు సొంత గూడు లేక ఇబ్బంది పడుతున్నారు. కొబ్బరి మట్టలతో వారు ఏర్పాటు చేసిన గుడెసెలో విద్యుత్ వంటి కనీస సౌకర్యం కూడా లేదు. దశాబ్ద కాలంగా దెందులూరు నియోజకవర్గంలో పేదలకు, రోగులకు ఆపన్న హస్తం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత సభ్యులు వారి ఇంటికి వెళ్లి అక్కడి పరిస్థితులు చూసి స్పందించి రూ.10 వేలు నగదు, నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు. మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, ఏనుగు రామకృష్ణ, మరీదు లక్ష్మణరావు, గంగుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పశువులకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్



గేదెలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

దెందులూరు: పోతునూరు పశు వైద్యశాల పరిధిలో హెచ్‌ఎస్ వ్యాక్సిన్ (దొమ్మ టీకా)ను గేదెలు, ఆవులకు వేస్తున్నామని పశు వైద్యశాఖ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు తెలిపారు. మంగళవారం పోతునూరులో పశువైద్యశాఖ ఆదేశాలకు అనుగుణంగా గేదెలు, ఆవులు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రతి గ్రామంలో హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోతునూరు పశువైద్యశాఖ పరిధిలో 2,240 గేదెలు, ఆవులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 70 శాతం వ్యాక్సిన్లు వేశామన్నారు. పశువులకు వ్యాక్సిన్లు వేయించకుంటే గొంతువాపు వచ్చే ప్రమాదం ఉందని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శ్రీరాములు అన్నారు.

ఈవీఎంలు లేని ఎన్నికల ప్రక్రియ చేపట్టాలి

కొయ్యలగూడెం: భారతదేశంలో ఈవీఎంలు లేని ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పీ.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలో నూట ఇరవైకి పైగా దేశాలు ఈవీఎంలను బహిష్కరించి బ్యాలెట్ పేపర్‌పై నేరుగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నాయన్నారు. కానీ భారతదేశంలో ఈవీఎంలపై అనేక పార్టీలు సందేహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాటిని ఎందుకు కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. చూస్తుంటే ఈవీఎంల ప్రక్రియ కొనసాగించాలని చూస్తున్న రాజకీయ పార్టీల చిత్తశుద్ధిని సంకించాల్సి వస్తోందన్నారు. కోట్లాది మంది ఓటర్లు అందుకు తగ్గ విధంగా ఎలక్షన్ పోల్స్ నిర్వహించగలిగిన లక్షలాది సిబ్బంది ఉండగా ఈవీఎంల వ్యవస్థను అమలు చేయాలనుకోవడం దురుద్దేశం అవుతుందన్నారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తికి, చీఫ్ ఎలక్షన్ కమిషన్, భారత రాష్ట్రపతిలకు ఫిర్యాదు చేశామన్నారు.

మోటూరుకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): సీపీఎం రాష్ట్ర నాయకులుగా, ప్రజాశక్తి సంపాదకుడిగా పనిచేసిన మోటూరు హనుమంతరావుకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మోటూరు 23వ వర్థంతి సభ మంగళవారం స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ లింగరాజులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోటూరు సేవలను గుర్తుచేశారు. నాయకులు పి.కిషోర్, పి.రామకృష్ణ, బి.సోమయ్య, కంది విశ్వనాథం, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వై.కోటేశ్వరరావు, వి.శివప్రసాద్, పి.గంగరాజు, వై.సీతారామ్, పి.సూర్యారావు, ఆర్‌వీఎస్ నారాయణ, మీసాల సీత్యం తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపుడెక్క



భీమడోలు వంతెన వద్ద కాలువలో ఒకవైపు గుర్రపుడెక్క, తూడుతో నిండిన దృశ్యం



వంతెనకు మరో వైపు అరకొరగా ప్రవహిస్తున్న నీరు

- గోదావరి కాలువలో అరకొర నీటి ప్రవాహం
- గగ్గోలు పెడుతున్న రైతులు

భీమడోలు: గోదావరి కాలువలో నీటి ప్రవాహానికి తూడు, గుర్రపుడెక్క తీవ్ర ఆటంకంగా మారాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న గోదావరి నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డంకిగా మారింది. దీంతో నీరు కిందికి వెళ్లే అవకాశం లేక సాగు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గోదావరి కాలువకు శివారు ప్రాంతంలోని గుండుగొలను సెక్షన్ పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను నీటిని విడుదల చేయకముందే వేసవిలో తొలగించాల్సి ఉంది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వల్ల ఈ పనులు చేపట్టలేదు. దీనితో పాటు గోదావరి కాలువకు నీటి విడుదల తక్కువగా ఉండడం, అడ్డుగా ఉన్న తూడు, గుర్రపుడెక్కల వల్ల నీరు శివారు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. దీనితో ఆయా ప్రాంతాల్లోని రైతులు ఇబ్బంది పడుతున్నారు. భీమడోలు, పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరులోని వంతెనల వల్ల దట్టమైన గుర్రపు డెక్క కిలోమీటర్ల మేర పేరుకుపోయింది. భీమడోలు వంతెన వద్ద ఎడమ వైపు గుర్రపు డెక్కతో కిలోమీటర్ మేర పెరిగి కుడి వైపున అరకొరగా నీరు కిందికి ప్రవహిస్తోంది. దీంతో గుండుగొలను సెక్షన్ పరిధిలోని భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లోని వేలాది ఎకరాల్లోని పంట చేలకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. వరుణుడు సైతం కరుణించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంజన్న సన్నిధిలో అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో అన్నదానం నిర్వహించారు. మంగళవారం పురస్కరించుకుని భక్తులకు నిర్వహించిన అన్నదానానికి రేమల్లె వాస్తవ్యులు తుమ్మల రవికాంత్, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అర్చకులు పాల్గొన్నారు. తొలుత అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

దేవాలయ భూముల కౌలు హక్కు వేలం

పెదపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాలయ భూముల కౌలు హక్కును వేలం నిర్వహించినట్లు పెదపాడు గ్రూప్ ఆఫ్ దేవాలయ అధికారి ప్రకృతాంబ తెలిపారు. అధిక ధరకు దక్కించుకున్న రైతుల పేరిట కౌలు హక్కును అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాడు గ్రామంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారీ బడికి వెళ్లాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్



ఉప్పాకపాడులో విద్యార్థుల ర్యాలీ

దెందులూరు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలోని ప్రతి చిన్నారి బడికి వెళ్లి విద్యనభ్యసించాలని దెందులూరు ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. మంగళవారం దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో చిన్నారులను బడిలో చేర్పించడం కోసం దెందులూరు పాఠశాలకు విచ్చేసిన తల్లిదండ్రులు, విద్యార్థులతో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పీ.శ్రీలత, ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి, అవగాహన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య లభిస్తుందని ఉప్పాకపాడు ఎంపీటీసీ సభ్యుడు ఇంటి మంగారావు అన్నారు. మంగళవారం నేను బడికి పోతాం కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ ప్లస్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మంగరావు మాట్లాడుతూ బడి బయటకురాని పిల్లలు గ్రామంలో ఉండకూడదని అన్నారు. గ్రామ పెద్దలు వెంకటేశ్వరరావు, దాసరి శ్రీను, మంచాల పెద్ద సత్యనారాయణ, దాసరి వీర్రాజు, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు అల్లు శ్రీ ను, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, ఉన్నీషా పాల్గొన్నారు.

29న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీలత, ఎంఈఓ ప్రసాద్

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీలత, ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. మంగళవారం దెందులూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓలు మాట్లాడుతూ దివ్యాంగులైన బాలబాలికలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి వారి అవసరాలకు ఉపకరణాలు అందజేస్తారన్నారు. అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన వసతితో పాటు రవాణా ఖర్చులు ఇస్తామన్నారు. మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సదరం, రేషన్ కార్డులు జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. బుద్ధి మాంద్యం గల పిల్లలకు అదనంగా కులధ్రువీకరణ పత్రం (పాతదైనా పర్వాలేదు) యూడీఐడీ కార్డు జెరాక్స్ కాపీలు, 4 ఫొటోలు తీసుకురావాలన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు





సహాయక చర్యల్లో భాగంగా కూలిన చెట్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది., స్థానికులు

దెందులూరు: దెందులూరులో ఈదురుగాలులు, వర్షానికి మంగళవారం సాయంత్రం చెట్లు కూలిపోయాయి. కొవ్వలి వంతెన వద్ద దెందులూరు ప్రాథమిక పాఠశాల వద్ద కొమ్మలు, చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒక పక్క వర్షం, మరొక పక్క ఈదురుగాలులు వీయడంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ శాఖ దెందులూరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ ఉషారాణి ఆధ్వర్యంలో దెందులూరు లైన్‌మెన్ వీరయ్య, గ్రామంలో కొందరు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. కూలిన చెట్లు, విరిగిపడిన కొమ్మలను నరికి తొలగించారు. ట్రాక్టర్‌పై కలపను తరలించి రాకపోకలకు అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. ఈదురుగాలులు తగ్గుముఖం పట్టిన తరువాత లైన్లు పరిశీలించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈదురుగాలులు, జోరు వర్షంలో శ్రమించిన దెందులూరు లైన్‌మెన్ వీరయ్యను అసిస్టెంట్ ఇంజనీర్ ఉషారాణి, గ్రామస్తులు అభినందించారు.

సీతంపేట పంట కాలువలో పూడికను తొలగిస్తాం



దెందులూరు సైఫన్ వద్ద ఇరిగేషన్ డీఈ కొడాలి బాబుతో మాట్లాడుతున్న రైతు నాయకులు

దెందులూరు: సీతంపేట కాలువలో 5 వేల ఎకరాల సాగు ప్రయోజనాలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ కొడాలి బాబు అన్నారు. మంగళవారం రైతు నాయకులు వీరమాచినేని శివాజీ, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్య చౌదరి ఆధ్వర్యంలో సీతంపేట కాల్వ ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీరమాచినేని శివాజీ, గారపాటి కొండయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరు- అలుగుల గూడెం రైల్వే క్రాసింగ్ రోడ్డు వద్ద అండర్‌పాస్ నిర్మించిన సమయంలో మట్టిని రైల్వే కాంట్రాక్టర్ సీతంపేట కాలువలో వేశారన్నారు. సీతంపేట కాలువ ఆయకట్టులో 5 వేల ఎకరాలకుపైగా సాగు ఆధారపడి ఉందన్నారు. వెంటనే మట్టిని తొలగించి నీరు చివర భూములకు సైతం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు నాయకులు, రైతుల సూచనల మేరకు డివిజనల్ బాబు రైల్వే అధికారులతో మాట్లాడారు. తక్షణమే పనులు ప్రారంభించి సాగుకు నీరందే విషయంలో అడ్డంకులు లేకుండా చర్యలు ప్రారంభిస్తామని రైల్వే అధికారులు డీఈకి సమాధానమిచ్చారు. అనంతరం సైఫన్ మరమ్మతులు చేయాలని కోరారు. సమావేశంలో దెందులూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల

చింతలపూడి: రైతులకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశ్యంతో అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో భాగంగా మొదటి విడత నిధులను మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ నాగకుమార్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి సబ్ డివిజన్‌లో 30,105 మంది అర్హులైన రైతులకు రూ.6,02,10,000 నిధులను రైతుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 78 ఆర్‌బీకే కేంద్రాల్లో ప్రధానమంత్రి పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్న లైవ్ టెలికాస్ట్‌ను రైతులకు ప్రదర్శించినట్లు తెలిపారు. మండలాల వారీగా చింతలపూడి మండలంలో 9,023 మంది రైతులకు రూ.1,86,40,000, లింగపాలెం మండలంలో 7,004 మంది రైతులకు రూ.1,40,08,000, కామవరపుకోట మండలంలో 6,805 మంది రైతులకు రూ.1,36,10,000, టీ.నరసాపురం మండలంలో 7,273 మంది రైతులకు రూ.1,45,46,000 నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో పీఎం కిసాన్ నిధులు ఖాతాల్లో జమ అవ్వని రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో మీనా కుమారి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

చింతలపూడి: పిల్లలను పనికి కాకుండా, బడికి పంపించి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాల కార్మిక నిరోధక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆంథోనీ నగర్ ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల బాలికలు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలు చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు దూరంగా ఉంచాలని హెచ్చరించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్షతో పాటు జరిమాన కూడ విధిస్తామని తెలిపారు.నిర్బంధ విద్యాహక్కు చట్టం ద్వారా బాలబాలికలు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.నాగేశ్వరరావు, న్యాయవాదులు ఉమర్ ఫరూఖ్, పీ.డేవిడ్ రాజు, కే.దుర్గాభవాని, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి పాల్గొన్నారు.

యథేచ్ఛగా గుట్కా విక్రయాలు

- అమలు కాని నిషేధాజ్ఞలు
- షాపుల్లో అధిక ధరలకు విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



పెదవేగి మండలంలోని దుకాణాల్లో విక్రయిస్తున్న గుట్కాలు

పెదవేగి : పెదవేగిలో నిషేధిత గుట్కాల అమ్మకాలు బహిరంగంగానే సాగుతున్నా పోలీస్, మండల పరిషత్, ప్రజారోగ్య విభాగ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెదవేగికి కూతవేటు దూరంలో ఉన్న ఏలూరు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిషేధాజ్ఞలు ఉల్లంఘించి రెట్టింపు ధరలకు గుట్కా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వీరి వద్ద గుట్కాలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయించే చిన్న వ్యాపారులు సైతం ప్యాకెట్ల ధరలు చూసి కళ్లు తేలేస్తున్నారు. ఇక గుట్కా వ్యసనపరుల విషయానికొస్తే అధిక ధరలకు కొనలేక అలవాటును మానుకోలేక జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు.

అన్నీ అధిక ధరలే

ప్రభుత్వం గుట్కా అమ్మకాలపై నిషేధాజ్ఞలు విధించడం దళారులకు కాసులవర్షం కురిపిస్తోంది. గతంలో రూపాయికి విక్రయించిన ఒక ప్యాకెట్‌ను ప్రస్తుతం 7 రూపాయలకు విక్రయిస్తూ వ్యసనపరుల జేబులు గుల్ల చేస్తున్నారు. బడ్డీ వ్యాపారులు అదే సింగిల్ ప్యాకెట్‌ను 10రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పట్టణంలో ఈ వ్యాపారం లక్షల్లో, మండలాల్లో వేలల్లో సాగుతోంది.

స్పందించని అధికార యంత్రాంగం

గుట్కా ప్యాకెట్ల విక్రయాలను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం మండలంలో ఇంత వరకు ఏ ఒక్క దుకాణంపై దాడులు చేసిన దాఖలాలు లేవు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ, వారిచ్చే ముడుపులకు ప్రీతిపాత్రులు అవుతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గుట్కా ప్రియుల బలహీనత వల్ల గుట్కాలను బహిరంగంగానే అధిక ధరలకు విక్రయిస్తున్న హోల్‌సేల్, రిటైల్ ఆగడాలకు అధికారులు ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాలని, నిషేధాజ్ఞలు పటిష్ఠంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగునీటి నివారణకు చర్యలు



ఎగువ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల వారికి నోటీసులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి గిరి, పాలక వర్గం

సాక్షి స్పందన

ఉంగుటూరు: ఉంగుటూరు మెట్ట ప్రాంతంలో ఉన్న పరిశ్రమల యజమానులకు మంగళవారం పంచాయతీ పాలకవర్గం నోటీసులు జారీ చేశారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో కూడిన మురుగునీరు రైల్వే గేటు వరకు ఉన్న ప్రధాన వాగులోకి చేరుతోంది. దీని ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సాక్షిలో సోమవారం పరిశ్రమల వ్యర్థాల నీటితో దుర్వాసన శీర్షికతో ప్రచురితమైన కథనంపై పంచాయతీ పాలకవర్గం స్పందించింది. ఈమేరకు పరిశ్రమల యజమానులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పరిశ్రమల వ్యర్థాల నీటితో వాగులోని నీటితో పాటు ఆక్వా చెరువుల్లోని చేపలు చనిపోతున్నాయని పాటదారులు ఫిర్యాదు చేస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. నివాసితులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని పరిశ్రమల వారు మురుగునీరు కిందికి ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే పంచాయతీ 1994 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈవో గిరి నోటీసులో పేర్కొన్నారు. నోటీసు జారీ చేసిన 7రోజుల్లోగా స్పందన కనిపించాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. సర్పంచి బండారు సింధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్, వార్డు సభ్యులు ఉన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల



ఉంగుటూరులో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్క్రీనుపై ప్రధాని ప్రసంగాన్ని తిలకిస్తున్న రైతులు



భీమడోలు ఆర్‌బీకే వద్ద పీఎం సందేశాన్ని తిలకిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, రైతులు, నాయకులు

ఉంగుటూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమ్మాన్ నిధి విడుదల ప్రక్రియను ఉంగుటూరు రైతులు మంగళవారం తిలకించారు. ఉంగుటూరు ఆర్‌బీకే సెంటర్లో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో రైతులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అర్హులైన రైతులు బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.2 వేలు 17వ విడత సహాయాన్ని ప్రకటించి కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. నరేంద్రమోదీ చేతుల మీదుగా దీనిని విడుదల చేశారు. ఉంగుటూరు మండలంలో 6,322 మంది రైతులకు రూ.1,26,44000 పీఎం కిసాన్ పెట్టుబడి సాయం కింద రైతుల అకౌంట్లలో జమ చేశారు. ఏవో బాలిన వెంకటేష్, ఏడీఏ ఉషారాజకుమారి, ఉప సర్పంచి పాతూరి జగదీష్, బీజేపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ యోజన నగదు జమ

భీమడోలు: పీఎం కిసాన్ యోజనలో మండలంలోని 3,256 రైతులకు తొలి విడతగా రూ.2వేల చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లోకి నగదును జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణి మంగళవారం తెలిపారు. భీమడోలు ఆర్‌బీకే -1 వద్ద రైతులు పీఎం సందేశం ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. ఒకొక్క రైతుకు మూడు విడతలుగా కేంద్ర ప్రభుత్వం రూ.6వేల నగదును జమ చేస్తుంది. దీనిలో భాగంగా తొలి విడతగా సార్వా సాగుకు ముందుగా రూ.2వేల చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ నగదును వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవాలన్నారు.మండలంలోని 13,362 ఎకరాల్లో సార్వాలో వరి సాగవుతుందని, ఇప్పటి వరకు 210 ఎకరాల్లో నారుమడి వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐచ్ఛిక ప్రకటనలు
శ్రద్ధాంజలి, సంతాప, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
90102 23729
99122 20559
Office mail : tpgadvt@gmail.com